క్లుప్తంగా

డయేరియాపై అప్రమత్తత అవసరం



ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: డయేరియా వ్యాధిపై అప్రమత్తత అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. శుక్రవారం పట్టణంలోని గౌడ లేఅవుట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. అతిసార ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించేలా చూడాలన్నారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడీఓ డాక్టర్ రమేష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అజార్‌ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ చేయాలి



మలయనూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కుందుర్పి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం మలయనూరు అంగన్‌వాడీ సెంటర్– 2లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, నవీన్‌కుమార్ ఆరోగ్య కార్యకర్త విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త లలిత, సచివాలయ సిబ్బంది గంగాధర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ షాపు యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మానాయక్

రాయదుర్గం రూరల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫర్టిలైజర్ షాపు యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల ముందు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు తగిన సూచనలు, సలహాల కోసం 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వ్యవసాయాధికారి మహేంద్ర, ఫర్టిలైజర్ షాపు యజమానులు, డీలర్లు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

గుమ్మఘట్ట: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చేలా చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పొలంబడిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి కేంద్ర వాణిజ్య, పన్నులశాఖ డైరెక్టర్ పూజలు



నృసింహస్వామిని దర్శించుకుంటున్న కేంద్ర వాణిజ్య పన్నులశాఖ డైరెక్టర్ అరుణ్‌నందన్

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామిని కేంద్ర వాణిజ్య, పన్నులశాఖ డైరెక్టర్ అరుణ్‌నందన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామికి అరుణ్‌నందన్ పూజలు, అభిషేకాలు చేయించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను కేంద్ర డైరెక్టర్‌కు తెలియజేశారు.

కర్రల కష్టం

రైతన్నలు రేయి, పగలు రెక్కల కష్టం చేస్తూ పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవడం చూశాం.. అయితే వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు వచ్చాయి. టమాట రైతులకు కర్రల కష్టం వచ్చింది. టమాటాల దిగుబడి అధికంగా రావడంతో ఆ బరువుకు మొక్క నేల వాలిపోతుంది. దీంతో కాయలు నేలతాకి కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఈ నష్టాన్ని ముందే పసిగట్టిన రైతులు.. మొక్కలకు ఊతంగా కర్రలు నాటుతున్నారు. తద్వారా పంటల సాగు కూడా కొత్త పుంతలు తొక్కుతోందని ప్రతి నోటా వినిపిస్తోంది. జిల్లాలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గం టమాట సాగుకు పెట్టింది పేరైతే.. ఆతర్వాత స్థానంలో నిలిచే రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ అధిక శాతం మంది రైతులు బోరుబావుల కింద టమాట సాగుకు మక్కువ చూపుతున్నారు.

- పంటలకు ఊతంగా నాటుతున్న కర్రలు
- నీలగిరి కర్రలకు భారీ డిమాండ్
- కర్ణాటక నుంచి తెచ్చుకుంటున్న టమాట రైతులు
- ఒక్కో కర్ర రూ.12 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు



కర్ర సాయంతో ఏపుగా పెరిగిన టమాట పంట

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వ్యవసాయంపై ఆధారపడకుండా, ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపుతున్నారు. సీజన్‌తో పని లేకుండా ఏటా సుమారు 50 వేల ఎకరాల్లో టమాట సాగు చేస్తారు. ఇందులో సుమారు 35 వేల నుంచి 40 వేల ఎకరాలు ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే ఉండడం విశేషం. ఇందుకు రూ. లక్షలు పెట్టుబడి పెడుతున్నారు. పంట సాగు కంటే మొక్కకు సపోర్టుగా వాడే ఊత కర్రలు తెచ్చుకోవడం రైతుకు మరింత భారమవుతోంది. జిల్లాలో ఆశించిన స్థాయిలో నీలగిరి, వెదురు, ఇతర కలపచెట్లు లేకపోవడంతో ఊత కర్రలు కూడబెట్టేందుకు రైతులు కష్టాలు పడాల్సి వస్తోంది.



టమాట పంటకు కర్రలు నాటిన దృశ్యం

పొరుగు రాష్ట్రం నుంచి దిగుమతి

టమాట సాగుకు అవసరమయ్యే నీలగిరి, వెదురు కర్రలు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ఆశించిన స్థాయికంటే ఎక్కువే లభిస్తాయి. దీంతో అక్కడ టన్ను లేదా కర్ర ప్రకారం కొనుగోలు చేసి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఒక్కో కర్ర రూ.12 నుంచి రూ.15 చెల్లించాల్సి వస్తోంది. ఆర్థిక స్థోమత లేని రైతులు కొండలు, గట్ల వెంట వెళ్లి సింజాలి, ఇతర చెట్ల నుంచి కర్రలు తెచ్చుకొని నాటుకుంటున్నారు.

ఎకరాకు 2వేల కర్రలు అవసరం

ఎకరాకు ఎనిమిది వేల టమాటా మొక్కలు (నారు) నాటాలి. నాలుగు మొక్కలకు ఒక కర్ర చొప్పున ఎకరాకు రెండు వేల కర్రలు అవసరం. ఎకరాకు సరిపడా కర్రలకు రూ.32 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కల సుమారు 50 వేల ఎకరాలకు అవసరమయ్యే కర్రల కోసం రైతులు రూ.లక్షలు ఖర్చుచేయాలి. కర్రలు నాటడం వల్ల పంట దిగుబడితో పాటు కాయలు నాణ్యతగా వస్తాయి. దీనికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోంది.

ప్లాస్టిక్ పైపులు అందించాలి



టామాట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఉద్యానశాఖ ద్వారా రాయితీపై ప్లాస్టిక్ పైపులు అందించాలి. ఫలితంగా కర్రల కోసం పెద్ద చెట్లు నరికి వేయకుండా కాపాడుకోవచ్చు. కర్రలు కొనుగోలు చేసినా రెండు పంటలకు మించి రావడం లేదు. ఆధునిక పద్ధతిలో టమాట పంటను ప్రోత్సహిస్తే ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుంది.

– గిరిరెడ్డి, రైతు, బీటీపీ

కర్ణాటక నుంచి తెప్పిస్తాం



ఏటా టమాట సాగు చేస్తాం. మొక్కకు సపోర్ట్‌గా వాడే కర్రలను కర్ణాటకలో కొనుగోలు చేసి తెప్పిస్తాం. ఇందుకు చాలా ఖర్చవుతుంది. కర్ర నాటితేనే మొక్క నేలకు తాకకుండా అధిక దిగుబడి ఇస్తుంది. ప్రభుత్వం రాయితీపై కర్ర లాంటి చిన్న పైపులు అందిస్తే రైతుకు కూడా ఊతం అయినట్లు అవుతుంది.

– వాల్మీకి శివన్న, రైతు, రంగచేడు

వైఎస్సార్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజవర్గ వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 8న విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్ విగ్రహాల వద్ద ఈనెల 6న పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్లు ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహానేత వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన తర్వాత ప్రభుత్వాస్పత్రులు, అనాథాశ్రమాల్లో అన్నదానం, పాలు, పండ్లు పంపిణీ చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు జరపాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

కూడేరు: ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తేనే సుఖప్రసవం సాధ్యమని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ గర్భిణులకు సూచించారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులకు ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ షుగర్, రక్తంలో హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తం తక్కువ ఉన్న వారికి ఐరన్ మాత్రలు ఇచ్చారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలని గర్భంలోని శిశువు ఎదుగుదల బాగుంటుందని డాక్టర్ లక్ష్మీనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఫార్మసిస్టు వేణుగోపాల్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం సంప్రదించండి

కూడేరు: 18 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లలకు అవసరమయ్యే ఉప కరణాలను సమగ్ర శిక్ష ద్వారా అందించనున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. మండలంలోని దివ్యాంగ పిల్లలు ఎవరికైనా ట్రైసైకిల్లు, వీల్ చైర్లు, రొలేటర్, చెవిటి మిషన్ వంటివి కావాల్సి వస్తే కూడేరు హైస్కూల్‌లోని భవిత కేంద్రంలో సంప్రదించాలన్నారు. ప్రతి బుధవారం ఫిజియోథెరపీ కూడా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.


తేనెటీగల పెంపకంపై శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: తేనెటీగల పెంపకంపై రెండు నెలల పాటు ఆన్‌లైన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే శాస్త్రవేత్త రాధాకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తిలు, పట్టుపురుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ నుంచి శిక్షణ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. వివరాలకు hhpr://anfrau.ac.in వైబ్ సైట్‌లో చూడాలని, సెల్: 8008788776లో సంప్రదించాలని తెలియజేశారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పించామని ఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినందున ఆలయం కింది భాగంలో శుక్రవారం ఆలయ ఈఓ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న బాబారాంసింగ్ మహరాజ్

కంబదూరు: గురువును నమ్మి ఆధ్యాత్మిక వైపు నడిస్తే మనిషి ముక్తి పొందొచ్చని బాబా రాంసింగ్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడ్డెళ్లలోని రాధాస్వామి ఆశ్రమంలో సత్సంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బాబా రాంసింగ్ మహరాజ్ ఆధ్యాత్మిక సందేశాన్ని ఇచ్చారు. మూడు రోజుల పాటు ఈ సత్సంగ కార్యక్రమాలు ఉంటాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామ సమీపంలో వేదావతి హగరి నుంచి అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్ యజమాని మురళీపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కేజీబీవీలో హెల్త్ క్యాంపు

శెట్టూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. శుక్రవారం విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థినులకు డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ లలిత, వైద్య సిబ్బంది సరోజిని, లీలావతి పాల్గొన్నారు.

ఏపీ హెచ్ఏఎంఎస్ఏ నూతన కార్యకవర్గం ఎంపిక



ఉరవకొండ తాలూకా ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఉరవకొండ: ఉరవకొండ తాలుకా ఏపీ హెల్త్ అడ్మిన్ని స్టేషన్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హెచ్ఏఎంఎస్ఏ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికకు ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నుంచి వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, రాఘవేంద్ర ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యవర్గంలో తాలుకా అధ్యక్షులుగా హెచ్.ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల వెంకటేసులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగరంగయ్య, కోశాధికారిగా లలితమ్మ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రమేష్‌బాబు, సుజాత, అర్చన, గౌతమి, సహాయ కార్యదర్శులుగా నూర్‌మహ్మద్, భవాని, చంద్రకళ, లలిత, వరలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంజుల, పబ్లిసిటీ సెక్రటరీగా జయరాజ్, మహిళా సెక్రటరీగా సుశీలబాయి, ఈసీ సభ్యులుగా మాధవి, నాగమ్మ, మధు, రంగనాథ్‌రెడ్డి, సుమలత, లక్ష్మి, సంజీవ్, నాగరాజు, సుభాషిణి, మాలశ్రీలు ఎంపికయ్యారు.

రేపు వాల్మీకి ప్రజాప్రతినిధులకు సన్మానం

అనంతపురం రూరల్: వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న వాల్మీకి ప్రజాప్రతినిధులను సన్మానించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. శుక్రవారం వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి ప్రజా ప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఘనంగా సన్మానించాలన్న ఉద్దేశంతో ఈనెల 7న రుద్రంపేట సమీపంలో ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వాల్మీకులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉంటేనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుతామన్నారు. ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ స్వామి, కోశాధికారి కిశోర్ కుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు సూర్య నారాయణ, భాస్కర్ నాయుడు, రమణ, సూర్యనారాయణ, నరసింహులు, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటా అవగాహన

ఉరవకొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేజర్ పంచాయతీ ఈఓ గౌస్ సాహెబ్ వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి, ప్రచారం చేశారు. 10, 11, 12 వార్డుల్లో డ్రైడే ఫ్రైడేపై అవగాహన కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ కూడా అప్రమత్తంగా ఉండాలని పాల్తూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అరుణకుమారి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పాల్తూరులో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ ప్రతి ఒక్కరూ కూడా డ్రైడే పాటించాలని తెలియజేశా రు. పాల్తూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకర్, ఆరోగ్య, ఆశా వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కంబదూరు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి ఆసియా తెలిపారు. శుక్రవారం మండలంలోని అచ్చంపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన డెంగీ,మలేరియా,అతిసార తదితర వ్యాధులు విజృంభిస్తున్నాయని, ఇలాంటి తరుణంలో వ్యాధుల సోకకుండా అప్రమత్తంగా ఉండి కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులకు కూడా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.



కంబదూరులో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆసియా

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

బ్రహ్మసముద్రం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ వెంకటనాయుడు అన్నారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఆయా పంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిల్, రవి, కవిత, వెంకటరాముడు, మంజుళ, ప్రేమలత, మైలారప్ప పాల్గొన్నారు.

బొమ్మనహాళ్/బెళుగుప్ప: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఈఓఆర్డీ మాదవరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో కలసి నిర్వహించారు. డయేరియా, మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. హనిమరెడ్డిపల్లి, కాలువపల్లి, దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈఓఆర్డీ పర్యవేక్షించారు.

టీడీపీ నాయకులు తీరు మార్చుకోవాలి



బోయ సుంకమ్మను పరామర్శిస్తున్న కేవీ రమణ తదితరులు

వజ్రకరూరు: ప్రజా సేవ చేసేందుకు ప్రజలు అధికారమిస్తే, టీడీపీ నాయకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ, చిరుద్యోగులపై దౌర్జన్యం,దాడులు చేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు నేసే కోదండరాం అన్నారు. శుక్రవారం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకురాలు బోయ సుంకమ్మను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా నాయకుడు దరూరు రమేష్‌బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ ఉస్మాన్ తదితరులతో కలిసి ఆయన పరామర్శించారు. అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఉద్యోగులు, కార్మికులపై ఒత్తిళ్లు, దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలు అధికారమిస్తే, అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఛాయాపురంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు బోయ సుంకమ్మపై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి, ఏజెన్సీని వదలాలని బెదిరించడం సరికాదన్నారు. జరిగిన ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అదేపాఠశాలలో పని చేస్తున్న స్వీపర్ మహేశ్వరిపైనా టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి ఉ ద్యోగం వదిలి వెళ్లిపోవాలని బెదిరించడం దారుణమన్నారు.

గ్లౌజ్‌లు అందజేత

కంబదూరు: గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ పద్మావతమ్మ గ్లౌజ్‌లను శుక్రవారం అందజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో పంచాయతీ పరిధిలో కార్మికులు పారిశుధ్య పనులు విస్తృతంగా చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్త ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

విడపనకల్లు: హంచనహాల్ గ్రామంలో సర్పంచు బోయ పార్వతి ఆధ్వర్యంలో తాగునీటి బోరును శుక్రవారం రిపేరీ చేయించి, నీటి సమస్య పరిష్కరింపజేశారు. నెల రోజుల క్రితం తాగునీటి పథకం బోరు మరమ్మతుకు గురైంది. సర్పంచు స్పందించి మోటారును రిపేరీ చేయించారు. వైస్ ఎంపీపీ రాకెట్ల పుష్పావతి, నాయకులు కేశన్న, భీంరావు, మస్తాన్, వన్నూరప్ప పాల్గొన్నారు.

అనంత మ్యూజియం అభివృద్ధికి కృషి

అనంతపురం కల్చరల్: అనంతలో సర్వాంగ సుందరంగా నిర్మించిన మ్యూజియం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఐఆర్ఎస్ అధికారి, ఎలక్షన్ అబ్జర్వర్ విలాస్ పాండే అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని పురావస్తు ప్రదర్శన శాలను సందర్శించారు. ఆసక్తికరమైన అనంత చరిత్ర విశేషాలను తెలుసుకున్నారు. ప్రీ హిస్టారిక్ నుంచి ఆధునిక కాలం వరకు మానవుడు ఉపయోగించిన పనిముట్లు, కుండలను, టెర్రకోట బొమ్మలు, సున్నపు బొమ్మలు, పురాతన ఇటుకలు, బ్రాంజెస్, పెయింటింగ్స్ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యూజియంలో అంటీక్విటీస్ క్రమపద్ధతిలో అమర్చిన పద్ధతి ఎంతో బాగుందని కితాబిచ్చారు. ఇటువంటి చారిత్రక ప్రదేశాలు అందరికీ ఎంతో ఉపయోగపడతాయన్నారు. మ్యూజియం ఏడీ రజిత, ఇతర సిబ్బంది ఆయన్ను సత్కరించారు.

దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట: వర్షాధార భూముల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సురేశ్ తెలిపారు. చిన్న,సన్న కారు రైతులకు ఈ పథకం వర్తిస్తుందని ఆయన తెలిపారు. జాబ్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, వన్ బీ, చిన్న,సన్న కారు రైతు సర్టిఫికెట్, బ్యాంక్ పాసుపుస్తకం తీసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పనులకు వెళ్లేనే బిల్లులు ఇవ్వండి

కుందుర్పి: మండలంలో ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్లే కూలీలకు మాత్రమే బిల్లులు చెల్లించాలని ఆర్‌టీఐ సభ్యులు గోపాల్, శ్రీనివాసులు, ఈరన్న, రంగస్వామి తదితరులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

రైతులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామ సచివాలయంలో జిల్లా ఉద్యానశాఖ, రియా అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ ఫాం సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పంటల సాగు చేసిన తర్వాత నాలుగేళ్ల నుంచి దిగుబడి వస్తుందన్నారు. పంట దిగుబడితోపాటు ధర కూడా ఆశాజనకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, గ్రామపెద్దలు పంపాపతి, గ్రామకార్యదర్శి వెంకటేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, రియా కంపెనీ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవలందించండి



మాట్లాడుతున్న జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అధికారిణి ఓబుళమ్మ

కూడేరు: అంకిత భావంతో ప్రజలకు సేవలందించాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్ అధికారిణి(జీఎస్‌డబ్ల్యూఎస్) ఓబుళమ్మ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆమె కూడేరులోని సచివాలయం–1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఆమె మాట్లాడారు. సచివాలయం వద్దకు ఎందుకు వచ్చారని ప్రజలను ప్రశ్నించారు. పలువురు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చామని సమాధానం చెప్పారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఓడీఎఫ్ (మరుగుదొడ్ల) సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని తెలియజేశారు. ఆ తర్వాత మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పంటలకు తెగుళ్లతో రైతుల ఆందోళన



మాయదార్లపల్లి వద్ద తెగులు సోకిన టమాట పంట

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, కదరంపల్లి, బసాపురం, ఎనుములదొడ్డి గ్రామాల సమీపంలో సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, టమాట, ఖర్బూజా, కలింగర తదితర పంటలకు పచ్చ పురుగు, పేనుబంక, నల్లచీడ, ఆకుముడురు తెగుళ్లు సోకాయన్నారు. దీంతో పంటలను పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందేమోనని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల నివారణకు రూ.వేలకు వేలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేస్తున్నా, తెగుళ్లు అదుపులోకి రాలేదని మొక్కజొన్న, టమాట రైతులు రామలింగ, బొమ్మయ్య, రామాంజనేయులు, ఓబన్న తదితరులు తెలిపారు. వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు తెగుళ్లు సోకిన పంటలను పరిశీలించి, నివారణకు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.